
సాక్షి
ఒడిశా

ఆదివారం । 17 । సెప్టెంబర్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ.4,06,012
బంగారం	20 మిల్లీ గ్రాములు
వెండి	3 గ్రాముల 800 మిల్లీ గ్రాములు

-భువనేశ్వర్/పూరీ



ఉత్కల్‌లో ఉత్సవ శోభ

వినాయక చవితి ఉత్సవాలకు వేళయ్యింది. వాడవాడలా మండపాలు సిద్ధమవుతున్నాయి. విగ్రహాల కొనుగోలుతో మార్కెట్లు కిటకిటలాడాయి.

- 8లో



ఉత్సాహంగా బాలికల క్రీడాపోటీలు

బాలికల క్రీడాపోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. వివిధ విభాగాల్లో విద్యార్థినులు హోరాహోరీగా పోటీపడ్డారు.

- 8లో

న్యూస్‌రీల్

రంబా స్టేషన్ ఐఐసీ అధికారిగా సత్యబ్రత్



సత్యబ్రత్ బుతియా

బరంపురం : గంజాం పోలీసు జిల్లా పరిధిలోని రంబా పోలీసు స్టేషన్ కొత్త ఐఐసీ అధికారిగా సత్యబ్రత్ బుతియా బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఇంతవరకు కోంధమాల్ జిల్లా పుల్బణి పోలీసు స్టేషన్ ఐఐసీ అధికారిగా విధులు నిర్వర్తించారు. ఈ సందర్భంగా సత్యబ్రత్ మాట్లాడుతూ గంజాం పోలీసుస్టేషన్ పరిధిలో శాంతిభద్రతలు పరిరక్షించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త



సదస్సులో మాట్లాడుతున్న సుమన్ జెనా

జయపురం: సోషల్ మీడియా, సైబర్ నేరాల్లో చిక్కుకోకుండా ప్రతిఒక్కరూ చైతన్యంగా ఉండాలని న్యాయసేవా ప్రాధికరణ కార్యదర్శి సుమన్ జెనా అన్నారు. కొరాపుట్ జిల్లా జడ్జి, జిల్లా న్యాయ సేవా ప్రాధికరణ అధ్యక్షుడు సత్యనారాయణ మిశ్రా ఆదేశాల మేరకు శనివారం జయపురం సమితి హర్దాపుట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొబైల్ ఫోన్లు, ఆన్‌లైన్ షాపింగ్ చేసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఫేక్‌మెసేజ్‌లు, లింక్‌లకు స్పందించవద్దని సూచించారు. ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ వచ్చే మెయిల్స్‌ను పట్టించుకోవద్దన్నారు. కార్యక్రమంలో సైబర్ క్రైమ్ సెల్ ఇన్‌స్పెక్టర్ భవానీ ప్రధాన్, సైబర్ ఎక్స్‌పర్ట్ మనోరంజన్ ప్రైహ, ఈస్టర్ బిశాయి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాటు సారాబట్టీలపై దాడులు



సారాబట్టీలను పరిశీలిస్తున్న పోలీసులు

బరంపురం : గంజాం జిల్లా పరిధిలోని బంజనగర్ సమీపంలో నువాతుట్టా అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన నాటుసారా బట్టీపై బంజనగర్ ఎక్సైజ్ అధికారులు, పోలీసులు శనివారం దాడులు చేపట్టారు. ఏడు వేల లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేసినట్లు బరంపురం ఎక్సైజ్ కమిషనర్ ఉమేష్ చంద్ర మిశ్రా తెలిపారు. సారా తయారుచేసే పాత్రలు, ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

ఇద్దరు చైన్‌స్నాచర్ల అరెస్టు



అరెస్టయిన నిందితులు

జయపురం: మార్నింగ్ వాక్‌కు వెళ్లిన మహిళ మెడ లో గొలుసు తెంచుకుని పరారైన ఇద్దరిని అరెస్టు చే సినట్లు జయపురం పట్టణ పోలీసు సబ్ ఇన్‌స్పెక్టర్ సిద్ధాంత కుమార్ బెహరా శనివారం తెలిపారు. అరెస్టయిన వారు జయపురం డెప్పిగుడకు చెందిన సంజీత్ మహానందియ, అమోష్ గౌరద అలియాస్ బంటిగా అని పేర్కొన్నారు. జయపురం దాసరథి వీధిలో నివాసముంటున్న ఎం.సత్యనారాయణ భార్య సరస్వతి ఈ నెల 2న ఉదయం నడుస్తుండగా గాంధీచౌక్ మార్గంలో ఇద్దరు యువకులు వచ్చి నోరు మూసి రెండున్నర తులాల బంగారు గొలుసు తెంచుకుపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. దొంగతనం జరిగాక బంగారు గొలుసును జయపురం సారాసాహి నివాసి బిద్యాధర మహాపాత్రో కుమారుడు శ్రీకాంత మహాపాత్రొకు అమ్మినట్లు గుర్తించారు. దీంతో సదరు వ్యక్తి గొలుసును కరిగించారు. ఆయన నుంచి 2.5 గ్రాముల బంగారు కడ్డీని స్వాధీనపరచుకున్నట్లు పోలీసులు తెలిపారు.

క్యాంపస్ ఎన్నికలకు నో!



విద్యార్థుల నిరసన(ఫైల్)

- విద్యార్థి సంఘం ఎన్నికలకు మరోసారి బ్రేక్
- విద్యా క్యాలెండర్‌లో ప్రస్తావించని నవీన్ సర్కారు
- భగ్గుమంటున్న స్టూడెంట్ సంఘాల ప్రతినిధులు
- హక్కులు కాలరాయడమేనని మండిపాటు



ఓటింగ్‌లో పాల్గొన్న విద్యార్థులు(ఫైల్)

భువనేశ్వర్: ఈ ఏడాది క్యాంపస్‌లలో విద్యార్థి సంఘం ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకట్ట వేసింది. తాజాగా జారీ చేసిన ఉమ్మడి విద్యా సంవత్సరం క్యాలెండర్‌లో విద్యార్థి సంఘం ఎన్నికల ప్రస్తావన తొలగించింది. ఈ చర్యతో విద్యార్థి సంఘం వర్గాల్లో తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. రాష్ట్రవ్యాప్తంగా యూనివర్సిటీ, కాలేజీ క్యాంపస్‌లలో ఎన్నికలు నిర్వహించకూడదని ఒడిశా ప్రభుత్వం నిర్ణయించడం వరుసగా ఇది ఆరోసారి. రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ ఇటీవల విడుదల చేసిన 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఉమ్మడి క్యాలెండర్‌లో సైతం విద్యార్థుల సంఘం ఎన్నికలను ప్రస్తావించకపోవడంతో విద్యార్థి సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

కచ్చితంగా పాటించాల్సిందే..

ఉన్నత విద్యా విభాగం డిప్యూటీ డైరెక్టర్ రజత కుమార్ మాన్‌సింగ్ జారీ చేసిన ఉత్తర్వుల్లో ఈ విద్యా సంవత్సరంలో 72 రోజుల సెలవు దినాలు మినహా 180 బోధనా దినాలు ఉంటాయి. వేసవి సెలవులు ఈ ఏడాది మే 5 నుంచి ఆరంభమై జూన్ 19 వరకు కొనసాగుతాయి. ఉన్నత విద్యా శాఖ పరిధిలోని అన్ని రాష్ట్ర ప్రభుత్వ విశ్వవిద్యాలయాల వైస్–చాన్సలర్లు, అన్ని ప్రభుత్వ, స్వయం ప్రతిపత్తి, ప్రభుత్వేతర సహాయం పొందిన, ఇతర విద్యా సంస్థల ప్రిన్సిపాల్‌కు ఈ ఉత్తర్వులు జారీ చేశారు. 2023–24 విద్యా సంవత్సరంలో ఉమ్మడి విద్యా క్యాలెండర్‌ను కచ్చితంగా అనుసరించాలని అందులో స్పష్టం చేశారు.

హక్కులు కాలరాసేందుకే..

విద్యార్థుల ప్రజాస్వామ్య హక్కులను ప్రభుత్వం కాలరాస్తోందని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు యాషిర్ నవాజ్ అన్నారు. ఉన్నత విద్యాసంస్థల్లో టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది కొరత వంటి పలు సమస్యలు పరిష్కరించేందుకు విద్యార్థి ప్రతినిధులు అవసరమని పేర్కొన్నారు. విద్యార్థి సంఘం ఎన్నికలు నిర్వహించకుండా ప్రభుత్వం కుంటి సాకుల్ని ప్రకటిస్తుందని భారతీయ జనతా పార్టీ అనుబంధ విద్యార్థి సంఘం అఖిల భారత విద్యార్థి సంఘం (ఏబీవీపీ) ఆరోపించింది. ఎన్నికలపై ప్రభుత్వం వెంటనే నిర్ణయం తీసుకోకుంటే నవీన్ నివాస్ ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించింది. రాష్ట్ర ప్రభుత్వ చర్యలను ప్రతిపక్ష రాజకీయ పార్టీల విద్యార్థి విభాగాలు తీవ్రంగా నిరసించాయి. ఎన్నికల తేదీలను వెంటనే ప్రకటించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాయి.

2018 నుంచి బ్రేక్..

రాష్ట్ర వ్యాప్తంగా క్యాంపస్‌లలో 2018 నుంచి విద్యార్థి సంఘం ఎన్నికలు జరగడం లేదు. 2018లో తిత్లీ తుఫాను కారణంగా కాలేజీలు, యూనివర్సిటీల్లో ఎన్నికలు రద్దయ్యాయి. కోవిడ్ – 19 మహమ్మారి భయంతో 2020, 2021 సంవత్సరాల్లో ఎన్నికలు నిర్వహించ లేదు. 2022లో ఎన్నికలు నిర్వహించేందుకు నోటిఫికేషన్ కూడా విడుదల చేయకపోవడం విద్యార్థుల్లో ఆగ్రహానికి దారితీసింది. ఈ విషయమై క్యాంపస్ ఎన్నికల నిర్వహణ కోసం కాంగ్రెస్ విద్యార్థి విభాగమైన నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా (ఎన్ఎస్‌యూఐ) ఈ నెల 5న రాష్ట్రవ్యాప్తంగా వివిధ డిగ్రీ కళాశాలలు, రాష్ట్ర ప్రభుత్వ విశ్వవిద్యాలయాల ముందు నిరసన ప్రదర్శన చేసి ముందస్తుగా ఉద్యమానికి నడుం బిగించింది. తాజా విద్యా సంవత్సరం క్యాలెండర్‌ను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

నాయకత్వ లక్షణాలకు దెబ్బ..

ఏబీవీపీ రాష్ట్ర శాఖ కార్యదర్శి అరిజిత్ పట్నాయక్ మాట్లాడుతూ విద్యార్థుల నాయకత్వ లక్షణాలను ప్రభుత్వం చంపేసిందన్నారు. కాలేజీ క్యాంపస్‌లలో 20 లక్షలకు పైగా యువజన ఓటర్లు ఉన్నారని, వీరంతా ప్రభుత్వ ఉత్తర్వుల వ్యతిరేకంగా ఎదురు తిరుగుతారనే భయంతో ప్రభుత్వం ఇలా విద్యార్థి సంఘం ఎన్నికల్ని దాటవేస్తోందని ఆరోపించారు. క్యాంపస్ ఎన్నికలు నిర్వహించకుంటే ఏబీవీపీ ఉద్యమం తప్పదన్నారు. అవసరమైతే కోర్టును ఆశ్రయిస్తామని స్పష్టం చేశారు. అధికార బిజూ జనతా దళ్ 'బ్యూరోక్రాట్ల' పార్టీగా మారిందని, అందుకే కొత్త నాయకులను ఆవిష్కరించడాన్ని విస్మరించి ప్రభుత్వం విద్యార్థి సంఘాల ఎన్నికలను రద్దు చేయాలనుకుంటోందని ఆలిండియా స్టూడెంట్స్ ఫెడరేషన్ (ఏఐఎస్ఎఫ్) రాష్ట్ర శాఖ అధ్యక్షుడు సంఘమిత్ర జెనా ఆరోపించారు. మరోవైపు, లింగ్దో కమిషన్ నిర్దేశించిన నిబంధనలను విద్యార్థులు ఉల్లంఘిస్తున్నారని అధికార బిజూ జనతా దళ్ విద్యార్థి విభాగం బిజూ ఛత్ర (విద్యార్థి) జనతా దళ్ పేర్కొంది. అందుకే కళాశాలల ఎన్నికలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు బీసీజేడీ అధ్యక్షుడు డి.ఆర్.త్రిపాఠి తెలిపారు.

ఆదివాసీల అభ్యున్నతికి కృషి



భూమిపూజ చేసిన మంత్రి సరక, పక్కనే అనసూయ మాఝి తదితరులు



సంప్రదాయ దుస్తుల్లో ఆదివాసీ యువత

- ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి జగన్నాథ సరక
- ఆదివాసీ సంస్కృతి కేంద్రానికి భూమిపూజ

రాయగడ: ఆదివాసీల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం విశేష కృషి చేస్తుందని రాష్ట్ర ఆదివాసీ, ఎస్సీ సంక్షేమ శాఖ మంత్రి జగన్నాథ సరక అన్నారు. జిల్లాలోని కాసీపూర్ సమితి టికిరి సమీపంలో సుమారు రూ.20 లక్షల వ్యయంతో నిర్మించనున్న ఆదివాసీ సంస్కృతి కేంద్రానికి శనివారం భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆదివాసీల భాష, సంస్కృతి, కళలను పరిరక్షించాలన్న ఉద్దేశంతో రాష్ట్రంలో 23 స్పెషల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (ఎస్‌డీసీ) సంస్థలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి సమితిలో ఈ తరహా సంస్కృతి కేంద్రాలను నిర్మించాలన్న సంకల్పంతో ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు మంజూరు చేస్తోందన్నారు. ఆదివాసీ పాఠశాలల్లో ట్రైబల్ రిసోర్స్ సెంటర్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

అన్ని రంగాల్లోనూ అభివృద్ధి..

ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లోనూ అభివృద్ధి సాధిస్తోందని మంత్రి సరక అన్నారు. విద్యా, వైద్యం, సాగు, తాగు నీరు తదితర మౌలిక సౌకర్యాల కల్పనలో ముందంజలో ఉందన్నారు. ప్రజల ఆదరాభిమానాలు ఉన్నంత వరకు రాష్ట్రంలో నవీన్ ప్రభుత్వం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఎస్‌డీసీ రాష్ట్ర శాఖ ముఖ్యసలహాదారుడు ప్రదీప్ మాఝి మాట్లాడుతూ ఆదివాసీల సంక్షేమార్థం ప్రభుత్వం అనేక బృహత్తర ప్రణాళికలు, పథకాలను అమలు చేసిందన్నారు. అత్యధికంగా ఆదివాసీలు ఉన్న ప్రాంతాల్లో వారి జీవన స్థితిగతులు మెరుగుపరిచేలా ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం రాయగడ ఎమ్మెల్యే మకరంద ముదులి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సరస్వతి మాఝి, ఎస్‌డీసీ రాయగడ జిల్లా చైర్మన్ అనసూయా మాఝి తదితరులు ప్రసంగించారు. అంతకుముందు మంత్రి సరకకు కాసీపూర్ సమితి ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. ఆదివాసీ యువతీ,యువకులు సాంప్రదాయ దుస్తుల్లో నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు.



సభలో పాల్గొన్న కాసీపూర్ సమితి మహిళలు

పట్టుబడిన పేకాటరాయుళ్లు

- రెండు చోట్ల 8 మంది అరెస్టు
- రూ.1.67 లక్షల నగదు.. ఐదు బైక్‌లు స్వాధీనం



ధారకోట్‌లో అరెస్టయిన నిందితులు



గూడ్స్‌షెడ్ రోడ్డులో అరెస్టయిన నిందితులు

బరంపురం : జిల్లాలోని ధారకోట్ నలియా బొందా, శివాలయం వద్ద పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. ఐఐసీ అధికారి మహేంద్ర మహంతి కేసు వివరాలను శనివారం వెల్లడించారు. అస్కా పోలీసు స్టేషన్ పరిధిలోనిల ధారకోట్ వద్ద నలియా బొందా, శివాలయం వద్ద కొద్ది రోజులుగా రహస్యంగా పేకాట శిబిరం నిర్వహిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు అర్ధరాత్రి రంగంలోకి దిగి దాడులు చేపట్టారు. నలుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి రూ.87 వేల నగదు, 3 మొబైల్స్, మూడు బైక్‌లు స్వాధీనం చేశారు. అదే విధంగా, రైల్వేస్టేషన్ వెనుక వైపు గూడ్స్‌షెడ్ రోడ్డులో ఓ ఇంట్లో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై దాడులు జరిపినట్లు ఐఐసీ అధికారి బాబుసాన్ శెఠి తెలిపారు. నలుగురు జూదగాళ్లను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.80 వేల నగదు, 2 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఐఐసీ చెప్పారు.

కొరాపుట్ హవల్దార్‌కు పురస్కారం



గవర్నర్ నుంచి అవార్డు అందుకుంటున్న జితేంద్ర కుమార్ దాస్

కొరాపుట్: కొరాపుట్ జిల్లాకు చెందిన పోలీస్ హవల్దార్ జితేంద్రకుమార్ దాస్‌కు రాష్ట్ర గవర్నర్ గణేష్‌లాల్ పురస్కారం అందజేసారు. శనివారం రాష్ట్ర రాజధానిలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా 80 మంది పోలీసులకు ప్రెసిడెంట్ మెడల్ అందజేశారు. వివిధ సమయాల్లో ధైర్య సాహసాలు ప్రదర్శించినందుకు ఆగస్టు 15న ఈ అవార్డులకు ఎంపిక చేశారు. తాజాగా వీటిని ప్రదానం చేశారు.

పరిశ్రమలను వ్యతిరేకిస్తే ప్రతిఘటన తప్పదు



మాట్లాడుతున్న శివకుమార్ పట్నాయక్. పక్కనే ఉలక, ముదులి తదితరులు

రాయగడ: పరిశ్రమల ఏర్పాటును వ్యతిరేకించే వారు ఎవరైనా సరై తాము ప్రతిఘటిస్తామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు శివకుమార్ పట్నాయక్ స్పష్టం చేశారు. కాసీపూర్‌లో ఉన్న చేతన్ క్లబ్‌లో శనివారం బ్లాక్ బీజేపీ శాఖ నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పరిశ్రమల ఏర్పాటుతో ప్రజల జీవన శైలి మెరుగుపడుతుందన్నారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలుగుతాయని చెప్పారు. కాసీపూర్ సమితిలో బాక్సైట్ నిక్షేపాలను సద్వినియోగం చేసుకుంటే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. అయితే స్వచ్ఛంద సేవా సంస్థల ముసుగులో ప్రఫుల్ల సామంతరాయ్, నరేంద్ర మహంతి, అచ్యుత్‌దాస్ వంటి వారి మాటలు విని ప్రజలు మోసపోవద్దని హితవుపలికారు. అమాయక ఆదివాసీల పేరిట ఇప్పటికే కోట్లాది రూపాయలను అడ్డగోలుగా సంపాదించిన వారిని జిల్లాలో అడుగు పెట్టనీయవద్దని పిలుపునిచ్చారు. ఒకప్పుడు అమాయకత్వమే చిరునామాగా ఉండే ఈ ప్రాంత యువతలో నేడు ఎంతో చైతన్యం వచ్చిందన్నారు. బాక్సైట్ తవ్వకాల కోసం ప్రభుత్వ అనుమతులు పొందిన వేదాంత్ కంపెనీకి తమ పూర్తి మద్దతు ఉంటుందని ప్రకటించారు. అయితే తవ్వకాలు జరిగే ప్రాంతాల్లో ప్రజలకు మౌలిక సౌకర్యాలు కల్పించడం, వారి సమస్యల పరిష్కారానికి చొరవచూపడం తప్పనిసరని పేర్కొన్నారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర శాఖ కార్యవర్గ సభ్యుడు బసంత కుమార్ ఉలక, జిల్లా సాధారణ కార్యదర్శి కిషోర్ పండా, భరత్ నాయక్, హరీష్ ముదులి, కృష్ణ చంద్ర గౌడొ, ప్రశాంత్ మాఝి తదితరులు పాల్గొన్నారు.

ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొట్టిన బైక్

- ఇద్దరు యువకుల దుర్మరణం



ఘటనా స్థలంలో ట్రాక్టర్

మల్కన్‌గిరి: ఆగి ఉన్న ట్రాక్టర్‌ను బైక్ ఢీకొన్న ఘటనలో ఇద్దరు యువకులు దుర్మరణం పాలయ్యారు. మల్కన్‌గిరి జిల్లా పోడియ సమితి సిమిలిబంచా వద్ద శుక్రవారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. నాగరాజగూడ గ్రామానికి చెందిన కె.రమేష్ (27), కమారగూడ గ్రామానికి చెందిన మున్నా కరాం (26) రోజువారీ పని పూర్తి చేసుకుని తిరిగి ఇంటగికి బయలుదేరారు. నాందగఢ నుంచి కొంతదూరం వచ్చాక వీరు నడుపుతున్న బైక్ అదుపు తప్పి రహదారి పక్కనే లోడ్‌తో ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు. వీరిలో ఒకరి తల మొండెం నుంచి వేరు పడింది. స్థానికుల సమాచారం మేరకు పోడియ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోడియ పీహెచ్‌సీకి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. బైక్ బ్రేక్ ఫెయిల్ కావడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు.

పేపర్‌మిల్లును పూర్తి సామర్థ్యంతో నడపాలి



మాట్లాడుతున్న ప్రమోద్ కుమార్ మహంతి

జయపురం: సేవాపేపరు మిల్లును పూర్తిస్థాయి సామర్థ్యంతో నడిపించేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని పేపరు మిల్లు శ్రామిక సంఘాల నేతలు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శనివారం సంఘ అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ మహంతి అధ్యక్షతన పేపరుమిల్లు శ్రామిక సంఘ నాయకుల అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహంతి మాట్లాడుతూ శ్రామికులకు మూడు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని చెప్పారు. ఢిల్లీ నుంచి ఎం.కె.గుప్త అనే అధికారి వచ్చి మిల్లుకు ముడిసరుకులు సరఫరా చేసే విషయమై వెండర్లతో చర్చించారని, ఆ చర్చలు విఫలమయ్యాయని చెప్పారు. బకాయిలు చెల్లించే వరకు ముడిసరుకులు సరఫరాకు వారు అంగీకరించలేదని పేర్కొన్నారు. 2020 ఫిబ్రవరి 26న కొత్త యాజమాన్యం హైదరాబాద్ మదర్ అర్థ కంపెనీ మిల్లు బాధ్యతలు చేపట్టినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. నూతన యాజమాన్యం మిల్లు పేరుతో రూ.150 కోట్లు అప్పు చేసి అందులో రూ.100 కోట్లు గౌతమ్ థాపర్‌కు చెల్లించారని తమతో చర్చలు జరిపిన ఎం.కె.గుప్తకు వివరించామని తెలిపారు. వెంటనే మిల్లు నడిపేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘ కార్యదర్శి ప్రదీప్ పంజియ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చిలికాలో చేపల వేట

- నవంబర్ 30లోగా విధానం ఖరారు కావాలి: హైకోర్టు

భువనేశ్వర్: చిలికా సరస్సులో చేపల వేటకు సంబంధించిన తుది విధానాన్ని నవంబర్ 30లోగా కోర్టు ముందుంచాలని ఒడిశా హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ ఏడాది మే నెల 15న జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం ముసాయిదా విధానానికి తుదిరూపు, ఆమోదం కోసం ప్రక్రియ కొనసాగుతోందని, నిర్దేశించిన 6 నెలల్లోపు పూర్తి చేస్తామని ప్రభుత్వ న్యాయవాది డి.కె.మహంతి ధర్మాసనానికి వివరించారు. ఈ వివరణ పరిగణనలోకి తీసుకుని ప్రధాన న్యాయమూర్తి సుభాసిస్ తలపాత్ర, జస్టిస్ ఎ.కె.మహాపాత్రాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం నవంబర్ 30 వరకు గడువు మంజూరు చేసింది. చిలికాలో చేపల వేటకు సంబంధించిన ముసాయిదా విధానంపై తమ అభిప్రాయాన్ని అక్టోబర్ 10లోగా సమర్పించాలని అనుబంధ వాటాదారులను ధర్మాసనం ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ అంశంపై తర్వాత పరిశీలన డిసెంబర్ 4వ తేదీకి వాయిదా వేసినట్లు న్యాయస్థానం ప్రకటించింది. గతంలో అనేక ప్రాథమిక మత్స్యకార సహకార సంఘాలు (పీఎఫ్‌సీఎస్) న్యాయస్థానాన్ని ఆశ్రయించాయి. చిలికా సరసులో చేపల వేట కార్యకలాపాలను కొనసాగించడానికి అనుమతి కోసం జోక్యం చేసుకోవాలని అభ్యర్థించాయి. సంప్రదాయేతర మత్స్యకారుల జీవనోపాధి కోసం అక్రమ రొయ్యల ఘెరీలు (కంచె), కల్చర్ ఫామ్‌లను పూర్తిగా తొలగించడంపట్ల నిర్లక్ష్యం ప్రదర్శించి సంప్రదాయ మత్స్యకారుల జీవనోపాధికి గండి కొడుతున్నారని గోడు వినిపించారు. 1999 జూన్ 18న రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన లీజును మంజూరు నియమావళితో ఈ పరిస్థితి తలెత్తిందని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది మేలో జరిగిన విచారణలో రాష్ట్ర న్యాయవాది అభ్యర్థనను అనుమతిస్తూ, సంప్రదాయ మత్స్యకారులను, ప్రాథమిక మత్స్యకార సహకార సంఘాలను (పీఎఫ్‌సీఎస్) వాటాదారులలో చేర్చాలని కోర్టు పేర్కొంది.

పోర్టుఫోలియో జడ్జిని కలిసిన ఎస్పీ



పోర్టుఫోలియో జడ్జికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్పీ జీఆర్ రాధిక

శ్రీకాకుళం పాతబస్టాండ్: రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, శ్రీకాకుళం జిల్లా జ్యుడీషియల్ పోర్టుఫోలియో జడ్జి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డిని శనివారం ఎస్పీ జీఆర్ రాధిక మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా కోర్టు ఆవరణంలో జరగనున్న జ్యుడీషియల్ సమీక్ష సమావేశానికి వచ్చిన సందర్భంగా ఆయనను ఆర్అండ్‌బీ అతిథి గృహంలో కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

ఉత్సాహంగా ఫ్రెషర్స్ డే



ఫ్రెషర్స్ డే వేడుకలు ప్రారంభిస్తున్న ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ పెద్దాడ జగదీశ్వరరావు

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకొని ముందుకు సాగాలని శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ట్రిపుల్ ఐటీ) డైరెక్టర్ ప్రొఫెసర్ పెద్దాడ జగదీశ్వరరావు అన్నారు. ఎస్ఎం పురం క్యాంపస్‌లో శనివారం ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒత్తిడి లేని విద్య అందిస్తామని చెప్పారు. రెసిడెన్షియల్ విద్యా విధానం కావటం వల్ల విద్యార్థులు శ్రమించి చదివేందుకు తగ్గ వాతావరణం ఉంటుందని అన్నారు. పీయూసీలో నాలుగు,ఇంజినీరింగ్‌లో ఎనిమిది సెమిస్టర్లలో మంచి ప్రతిభ ప్రదర్శించాలని అన్నారు. ట్రిపుల్ ఐటీలో కరిక్యులమ్ భిన్నంగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో ఓఎస్‌డీ ప్రొఫెసర్ ఎల్.సుధాకర్‌బాబు, పరిపాలన అధికారి ముని రామకృష్ణ పాల్గొన్నారు.

జలయజ్ఞం కాలువలో నీటి గలగల

కొత్తూరు: వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో వంశధార ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన పారాపురం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి వరద కాలువల్లో వరద నీరు గలగలా పారుతోంది. ఒడిశాలో కురిసిన వానలకు వరద రావడంతో పారాపురం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో నీరు చేరింది. అక్కడ నుంచి వరద కాలువ ద్వారా హిరమండలం రిజర్వాయర్‌కు నీరు చేరుతోంది.

'రాజ్యాంగ హక్కులను కాపాడాలి'

శ్రీకాకుళం పాతబస్టాండ్: రాజ్యాంగం కల్పించిన హక్కులు కాపాడాల్సిన బాధ్యత న్యాయవాదులపై ఉందని జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎన్ని సూర్యారావు అన్నారు. ఆలిండియా లాయర్స్ యూనియన్ జిల్లా శాఖ అధ్యక్షుడు దుంపల రమణారావు, కార్యదర్శి డొంకాన ఈశ్వరరావు ఆధ్వర్యంలో ప్రపంచ న్యాయ దినోత్సవం సందర్భంగా రౌండ్‌టేబుల్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో 'భారత రాజ్యాంగం–ప్రస్తుత పరిస్థితులు' అనే అంశంపై చర్చను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులు, పౌర హక్కులు కాపాడాలన్నారు. చట్టాల్లో మార్పులు కాలానికి అనుగుణంగా ఉండాలని ఆకాంక్షించారు.

ఉత్కల్‌లో ఉత్సవ శోభ

- మొదలైన గణపతి ఉత్సవాల సందడి
- కొనుగోలుదారులతో కిటకిటలాడిన మార్కెట్



గణేష్ ప్రతిమకు తుది మెరుగులు దిద్దుతున్న బాలకృష్ణ షరాఫ్(ఫైల్)



పీఓపీ విగ్రహాలకు రంగులు అద్దుతున్న దృశ్యం

పర్లాకిమిడి: వినాయక చవితి ఉత్సవాల నేపథ్యంలో పర్లాకిమిడి మార్కెట్ శనివారం రద్దీగా మారింది. గణపతి విగ్రహాల కొనుగోలుదారులతో మార్కెట్ కిక్కిరిసిపోయింది. జిల్లా కేంద్రం పర్లాకిమిడిలో అనేక మంది కళాకారులకు నెలవు. అందుకే వివిధ ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రానికి తరలివచ్చి గణపతి విగ్రహాలు కొనుగోలు చేసి తీసుకువెళ్తుంటారు. ఈ సంవత్సరం పి.ఓ.పి.(ప్లాస్టర్)తో తయారుచేసిన వినాయక ప్రతిమలు నిషేధించినట్టు వారంరోజుల క్రితం కలెక్టర్ స్మృతిరంజన్ ప్రధాన్ ప్రకటన జారీ చేశారు. దీంతో పర్లాకిమిడిలో కటిక వీధి, చిత్రకారవీధిలో వినాయక ఇతర ప్రతిమలు చేసే కళాకారుల కుటుంబాలు విచారం వ్యక్తం చేస్తున్నాయి. ఈ ప్రాంతంలో మట్టి లోడు నాలుగైదు వేలు ధర పలుకుతుండటంతో ఇబ్బందులు తప్పడం లేదని కళాకారులు సౌమ్యరంజన్ బింధాని రత్న(పింటూ) ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పి.ఓ.పి.తో బొమ్మలు చేస్తే తక్కువ పెట్టుబడితో ఎక్కువ తయారుచేయవచ్చని, అదే మట్టితో చేస్తే నాలుగు అడుగుల వినాయక విగ్రహానికి రూ.15వేలు ఖర్చవుతుందని, అంత ధర పెట్టి ఎవరూ కొనుగోలు చేయరని చెబుతున్నారు.

అద్భుత విగ్రహాలకు కేరాఫ్ బాలకృష్ణ

జయపురం: వినాయక నవరాత్రులు వచ్చాయంటే జయపురం ప్రజలకు గుర్తొచ్చే వ్యక్తి దివంగత బాలకృష్ణ షరాఫ్. జయపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో డ్రాయింగ్ టీచర్‌గా పనిచేసిన ఈయన జీవకళ ఉట్టిపడేలా మట్టితో వినాయక ప్రతిమలు చేయడంలో దిట్ట. జయపురం వినాయక పూజా మండపాల్లో ఈయన చేసిన విగ్రహాలే ఏటా కొలువుదీరేవి. స్థానికులే కాకుండా జయపురం సబ్‌డివిజన్‌లో అనేక ప్రాంతాల నుంచి ఈయన వద్దకు వచ్చి విగ్రహాలు కొనుగోలు చేసే వారు. ఆయన మరణించినా ఆయన తయారు చేసిన గణపతి, దుర్గామాత ప్రతిమలను నేటికీ ఇక్కడి ప్రజలు మరువరు.

బరంపురంలో ఫ్లాగ్‌మార్చ్


బరంపురం : వినాయక చవితి ఉత్సవాల నేపథ్యంలో గంజాం జిల్లా బరంపురం నగరంలో శనివారం పోలీసులు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఎస్పీ సార్వేష్ వివేక్ ఆదేశాల మేరకు రెండు బెటాలియన్ల పోలీసుల బృందం కవాతు చేశారు. నగర ఫస్ట్‌గేట్ ప్రాంతంలో అర్ధరాత్రి వరకు వాహనాలను తనిఖీ చేశారు. అనుమానిత వాహనాలను పెద్ద బజార్ పోలీసు స్టేషన్‌కు తరలించారు.



బరంపురంలో పోలీసుల ఫ్లాగ్‌మార్చ్



ఫస్ట్‌గేట్ ప్రాంతంలో తనిఖీలు చేపడుతున్న పోలీసులు



కటిక వీధిలో తయారవుతున్న మట్టి గణపతి

బీజేపీ ఆధ్వర్యంలో 'నా దేశం నా మట్టి'



కొరాపుట్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మన్మోహన్ సామల్



కార్యక్రమంలో పాల్గొన్న ఉమ్మర్‌కోట్ ఎమ్మెల్యే నిత్యానంద గోండో

కొరాపుట్ : భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో శనివారం నాదేశం–నా మట్టి కార్యక్రమం నిర్వహించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మన్మోహన్ సామల్ ఆధ్వర్యంలో మట్టి సేకరించారు.

కొరాపుట్ పట్టణానికి చెందిన జసుదాన్ ఖోస్లా అనే జవాను 1965లో జరిగిన ఇండియా–పాక్ యుద్ధంలో అమరుడయ్యాడు. అతని విగ్రహం వద్ద మట్టిని సేకరించారు. అదే విధంగా సామల్ నేతృత్వంలో లక్ష్మీపూర్, సిమిలిగుడ ప్రాంతాల్లోనూ మట్టి సేకరించారు.

నబరంగ్‌పూర్ జిల్లా ఉమ్మర్ నియోజకవర్గంలో యువి–65 గ్రామంలో బీజేపీకి చెందిన ఉమ్మర్‌కోట్ ఎమ్మెల్యే నిత్యానంద గోండో ఆధ్వర్యంలో కార్యకర్తలు మట్టి సేకరించారు. కొరాపుట్, నబరంగ్‌పూర్ జిల్లాల్లోనూ నా దేశం–నా మట్టి కార్యక్రమం నిర్వహించారు.

ఉపాధ్యాయుల ఆందోళనకు సంఘీభావం



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మన్మోహన్ సామల్

కొరాపుట్: ప్రభుత్వ ప్రాథమిక ఉపాధ్యాయుల ఆందోళనకు భారతీయ జనతా పార్టీ, బిజూ జనతా దల్ పార్టీలు సంఘీభావం ప్రకటించాయి. కొరాపుట్ జిల్లా కేంద్రంలో జరుగుతున్న ఉపాధ్యాయుల ఆందోళన శిబిరాన్ని శనివరాం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మన్మోహన్ సామల్ సందర్శించారు. సమస్యల పరిష్కరమయ్యేలా రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తానని హామీఇచ్చారు. సామల్ వెంట కొరాపుట్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సుమంత్ ప్రధాన్ ఉన్నారు. అదే విధంగా నబరంగ్‌పూర్ జిల్లా ఉమ్మర్‌కోట్ నియోజకవర్గం రాయిఘర్ సమితి కేంద్రంలో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయుల ఆందోళన శిబిరాన్ని బిజూ జనతా దల్ పార్టీకి చెందిన నబరంగ్‌పూర్ పార్లమెంట్ సభ్యుడు రమేష్ చంద్ర మజ్జి సందర్శించారు. న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం రాష్ట్ర పెద్దలతో చర్చిస్తానని హామీ ఇచ్చారు.



ఉపాధ్యాయుల నుంచి వినతిపత్రం స్వీకరిస్తున్న ఎంపీ రమేష్ చంద్ర మజ్జి

ఉత్సాహంగా బాలికల క్రీడాపోటీలు



వందమీటర్ల రన్నింగ్ రేస్‌కు సిద్ధమైన బాలికలు

పర్లాకిమిడి: బేటీ పడావో.. బేటీ బచావ్ కార్యక్రమంలో భాగంగా స్థానిక గజపతి స్టేడియంలో శనివారం జిల్లా స్థాయి బాలికల అథ్లెటిక్స్ పోటీలు ప్రారంభమయ్యాయి. ప్రభుత్వ ఉన్నత విద్యాలయాలు, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థినులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు. ముందుగా జిల్లా అదనపు మెజిస్ట్రేట్ రాజేంద్రమింజ్, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ అధికారి అరుణ్‌కుమార్ త్రిపాఠిలు జ్యోతిని వెలిగించి పోటీలు ప్రారంభించారు. అనంతరం రాజేంద్రమింజ్ మాట్లాడుతూ ఇక్కడ రాణించిన విద్యార్థినులు భవిష్యత్తులోనూ ఉత్తమంగా ఆడి పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. కాగా, ఈ పోటీల్లో ఏడు సమితిల నుంచి 105 మంది క్రీడాకారిణులు పాల్గొన్నట్లు జిల్లా క్రీడాధికారి తెలిపారు. 100, 200 మీటర్ల రన్నింగ్, లాంగ్‌జంప్, హైజంప్, కబడ్డీ పోటీలు జరిగాయి.



జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభిస్తున్న ఏడీఎం రాజేంద్ర మింజ్

మో జంగిల్ జోమ్మి యోజన ప్రారంభం



మాట్లాడుతున్న ఐటీడీఏ అధికారి ఫాల్గుణి మఝి

పర్లాకిమిడి: స్థానిక జిల్లా పరిషత్ కాన్ఫరెన్సు హాలులో శనివారం మో జంగిల్.. జోమ్మి యోజన(నా అటవీ భూమి పథకం)ను కలెక్టర్ స్మృతిరంజన్ ప్రధాన్ ప్రారంభించారు. షెడ్యూల్డు జాతులు, ఇతర ఆదివాసీ సంప్రదాయక అటవీ నివాసులు చట్టం–2006 (ఎఫ్ఆర్ఏ–2006) ప్రకారం ఆదివాసీలకు అటవీ హక్కులను అందించి వారికి జీవనోపాధి పెంపొందించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ఈ పథకం అమలు చేస్తున్నారు. ఆదివాసీలకు జంగిల్ జమ్మి పట్టాలు ఇప్పించాలని ఐదు దశాబ్దాలుగా అనేక ప్రజాసంఘాలు పోరాడిన నేపథ్యంలో సుప్రీంకోర్టు చివరకు ఎఫ్ఆర్ఏ.చట్టం 2006 చేసింది. దీంతో పలు జిల్లాల్లో ఎస్టీ, ఆదివాసీ సంప్రదాయక జాతులకు ఆర్ఓఆర్ పట్టాలు లభించనున్నాయి. కార్యక్రమంలో జిల్లా సమగ్ర గిరిజనాభివృద్ధి శాఖ అధికారి ఫాల్గుణి మఝి, అటవీ, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా ఇంజినీర్స్ డే



మాట్లాడుతున్న ఇంజినీర్ నాగేశ్వర సేనాపతి

పర్లాకిమిడి: స్థానిక రాజవీధిలోని ప్రైవేటు కల్యాణ మండపంలో గజపతి జిల్లా ఇంజినీర్ల సంఘం ఆధ్వర్యంలో ఇంజినీర్స్ డే ఘనంగా నిర్వహించారు. ఇంజినీర్ మమతా కుమారీ స్వయిని ముఖ్య అతిథిగా పాల్గొని స్వాగతోపన్యాసం చేశారు. కార్యక్రమంలో డిప్లమో ఇంజినీర్ల సంఘం అధ్యక్షుడు సిద్దార్థ శంకర త్రిపాఠి, రాంకో సిమెంట్స్ ఇంజినీర్ కృష్ణ ప్రధాన్ తదితరులు పాల్గొన్నారు.

'తీరాన్ని కాపాడుకుందాం'

సోంపేట: సముద్ర తీర ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచాలని ట్రీ ఫౌండేషన్ కన్వీనర్ సోమేశ్వరరావు అన్నారు. ట్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నడుమూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు శనివారం బట్టిగళ్లూరు సముద్ర తీర ప్రాంతంతో శ్రమదానం నిర్వహించారు. బారువ బీట్ అధికారి సంతోష్, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కామరాజు, విద్యార్థులు, ట్రీ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇద్దివానిపాలెంలో..

కవిటి: మన సముద్ర తీరాన్ని మనమంతా కాపాడుకుందామని గ్రామస్తులు నినదించారు. శుక్రవారం మండలంలోని ఇద్దివానిపాలెం సముద్ర తీరాన్ని మత్స్యకార సంక్షేమ సమితి, ఇన్‌కోయిస్ సంస్థల సంయుక్త పర్యవేక్షణలో పరిశుభ్రం చేశారు. 60 మందితో మూడు గంటల పాటు శ్రమ దానం నిర్వహించారు.



కవిటి: ఇద్దివానిపాలెం సముద్రతీరంలో స్వచ్ఛసాగర్ కార్యక్రమం

పాస్టర్లకు గౌరవ వేతనం విడుదలపై హర్షం

ఇచ్ఛాపురం: పాస్టర్లకు గౌరవ వేతనం విడుదల చేయడంపై హర్షం వ్యక్తం చేస్తున్నట్లు వైఎస్సార్ సీపీ రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ సెల్ జనరల్ సెక్రటరీ పి.నాగేశ్వరరావు(జాన్ డేవిడ్), వైఎస్సార్ సీపీ జిల్లా క్రిస్టియన్ మైనారిటి సెల్ అధ్యక్షుడు ప్రత్తి అన్వేష్ తెలిపార్చు.

పట్టణంలోని క్రిస్టియన్ మైనారిటీ సెల్ కార్యాలయంలో శనివారం పాస్టర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించే ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే అన్నారు. జిల్లా క్రిస్టియన్ మైనారిటి సెల్ అధ్యక్షుడు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో దరఖాస్తు చేసుకున్న 106 మంది పాస్టర్లకు గౌరవవేతనం అందించిందని తెలిపారు. ఇంకా ఎవరైనా ఉంటే దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఓజోన్ పొర.. కాపాడుకుందాం రా!

ఓజోన్ డే సందర్భంగా విద్యార్థి లోకమంతా ఓ3 అంటూ ప్రదర్శనలు చేసింది. ప్రతి పాఠశాలలోనూ ఓజోన్ పొర ఆవశ్యకతను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. పలాస ప్రభుత్వ హైస్కూల్‌లో విద్యార్థులు ఇలా ప్రదర్శన చేశారు.

– కాశీబుగ్గ



విద్యార్థిని ఆత్మహత్య



కడుపునొప్పి తాళలేక ఆత్మహత్య చేసుకున్న కూర్మాపు భాగ్యలక్ష్మి

నందిగాం: కడుపునొప్పి తాళలేక మండలంలోని పెదలవునిపల్లికి చెందిన భాగ్యలక్ష్మి (17) అనే విద్యార్థిని శనివారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. నందిగాం పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం.. పెద్దలవునిపల్లికి చెందిన కూర్మాపు విష్ణుమూర్తి, శారద దంపతులకు ఒక కుమార్తె భాగ్యలక్ష్మి, ఒక కుమారుడు ఉన్నారు. భాగ్యలక్ష్మి నందిగాం ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్ బైపీసీలో సెకండియర్ చదువుతుండగా కుమారుడు శ్రీకాకుళంలో పాలిటెక్నిక్ కాలేజీలో చదువుతున్నాడు. భాగ్యలక్ష్మికి నెలసరిలో విపరీతమైన కడుపునొప్పి వస్తుండడంతో రెండు రోజులుగా కాలేజీకి వెళ్లడం లేదు. శనివారం ఉదయం తల్లిదండ్రులు ఇంటి నుంచి బయటకు వెళ్లిన సమయంలో ఆమె సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తల్లిదండ్రులు తిరిగి ఇంటికి వచ్చి చూసే సరికి ఆమె ఉరికి వేలాడుతూ కనిపించడంతో నిశ్చేష్టులయ్యారు. కిందకు దించి చూసే సరికి ప్రాణాలు లేవు. మృతురాలి తండ్రి విష్ణుమూర్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ అమీర్ అలీ కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని టెక్కలి జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు.

అనుమతులు లేకుండా మందుల విక్రయం



పార్వతీశం ఇంటిలో అనుమతుల లేకుండా విక్రయిస్తున్న మందులు పట్టుకున్న అధికారులు

రణస్థలం: రణస్థలం జేఆర్ పురంలో నివాసం ఉంటున్న వీవీ పార్వతీశం అనే వ్యక్తి ఎలాంటి అనుమతులు లేకుండా పశువుల మందులు విక్రయిస్తున్నాడని జిల్లా ఔషధ నియంత్రణ అధికారి ఎస్.యుగంధరరావు తెలిపారు. జిల్లా ఔషధ నియంత్రణ అధికారులకు వచ్చిన సమాచారం మేరకు జేఆర్ పురంలోని పార్వతీశం ఇంటిలో ఢిల్లీ సెంట్రల్ ఔషధ నియంత్రణ అధికారి డి.విజయ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి అనుమతులు లేకుండా ప్రభుత్వ మందులను కొనుగోలు చేసి తదుపరి ప్రైవేటు సిక్కర్లు అతికించి విక్రయిస్తున్నట్లు చెప్పారు. పశువుల వైద్యానికి సంబంధించిన 9 రకాలైన నకిలీ మందులను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ ప్రభుత్వ మందులు ప్రైవేటు స్టిక్కర్లతో అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు దర్యాప్తులో తేలిందన్నారు. జిల్లాలోని కోటబొమ్మాళిలో ఒక పశువుల మెడికల్ షాపు యజమాని ఈ మందులపై ఢిల్లీ ఔషధ నియంత్రణ అధికారులకు కొన్ని రోజుల కిందట ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. కర్నాటక స్టిక్కర్లతో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అమ్మకాలు జరుపుతున్నట్లు పేర్కొన్నారు. పార్వతీశంపై కేసు నమోదు చేశామని, తదుపరి చర్యల నిమిత్తం న్యాయస్థానానికి సమాచారం ఇవ్వడం జరిగిందన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఔషధాలు విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ఈ తనిఖీల్లో రణస్థలం ఏడీఏ బి.దుర్గారావు తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

లారీ ఢీకొని వ్యక్తి దుర్మరణం


ఆస్పత్రిలో మృతి చెందిన రాము

మెంటాడ(గజపతినగరం రూరల్): మండలంలోని మరుపల్లి గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై శనివారం పార్వతీపురం నుండి విశాఖ వైపు వెళ్తున్న లారీ ఢీకొని కోండ్రు రాము అనే వ్యక్తి మృతి చెందాడని హెచ్‌సీ సత్యనారాయణ తెలిపారు. కోండ్రు రాము మెరకముడిదాం మండలం మర్రివలస గ్రామానికి చెందిన వాడని, మరుపల్లి గ్రామంలోని తన కుమార్తె ఇంటికి వచ్చిన ఆయన రహదారి దాటుతుండగా లారీ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడని పేర్కొన్నారు. 108లో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, చికిత్స పొందుతుండగా మరణించినట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

కుక్కల దాడిలో చిన్నారులకు గాయాలు


కుక్కల దాడిలో గాయపడి చికిత్స పొందుతున్న బాలుడు

రాజాం సిటీ: స్థానిక హరిజన వీధిలో కుక్కలు స్వైరవిహారం చేసి ఇద్దరు చిన్నారులను గాయపర్చాయి. శనివారం ఉదయం వీధిలో ఆడుకుంటున్న వివేక్, అజయ్‌లపై ఒక్కసారిగా దాడి చేయడంతో గాయాల పాలయ్యారు. వెంటనే స్థానికులు గమనించి కుక్కలను చెదరగొట్టి చిన్నారులను రాజాం ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించి చికిత్సనందించారు. పట్టణంలో కుక్కల బెడద అధికంగా ఉండడంతో పట్టణ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు కుక్కల నివారణకు చర్యలు చేపట్టాలని పట్టణవాసులు కోరుతున్నారు.

పశువుల శాల దగ్ధం


కాలిన గాయాలతో ఆవు దూడలు


భామిని: మండలంలోని తాటిమానుగూడలో బిడ్డిక ఈశ్వరరావుకు చెందిన పశువుల పాకలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో రేగిన మంటలకు శాల కాలిపోయింది. ప్రమాదంలో ఒక మేక మృతి చెందింది. మరో 12 మేకలు తీవ్రంగా గాయపడ్డాయి. వీటిని రక్షించబోయి ఆదివాసీ మహిళ ఆరిక గౌరి గాయపడింది. శాలలో ఉన్న పాడి ఆవు, దూడలకు కూడా గాయాలయ్యాయి. వీఆర్‌ఓ రవికుమార్ ప్రమాద విషయం తెలుసుకొని నష్టాలు గుర్తించి అధికారులకు తెలిపారు. సంచార పశువైద్యశాలను రప్పించి గాయపడిన జీవాలకు వైద్యం చేయించారు. గౌరీని బాలేరు పీహెచ్‌సీకి చికిత్స నిమిత్తం తీసుకువెళ్లారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత


పీడీఎస్ బియ్యం స్వాధీనం చేసుకున్న సీఎస్‌డీటీ మూర్తి

శృంగవరపుకోట: పీడీఎస్ బియ్యం అక్రమంగా నిల్వ చేస్తున్నారన్న సమాచారంతో మండల సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్ ఎస్.వి.వి.ఎస్.మూర్తి రెండు దుకాణాల యజమానులపై శనివారం కేసులు నమోదు చేశారు. మండలంలో సంతగవిరమ్మపేట గ్రామంలో కిరాణా వ్యాపారులు మద్దుల శ్రీరామ్మూర్తి దుకాణం తనిఖీ చేయగా 177కిలోల పీడీఎస్ బియ్యం, అదే గ్రామానికి చెందిన కల్లూరి హరి దుకాణంలో 96కిలోల బియ్యం ఉన్నట్టు గుర్తించామన్నారు. దీంతో వారిరువురిపై 6ఏ కేసులు నమోదు చేసి జిల్లా ఉన్నతాధికారులకు నివేదికలు పంపినట్టు చెప్పారు.

20 నుంచి ఉక్కు రక్షణ యాత్ర


వాల్‌పోస్టరు విడుదల చేస్తున్న సీపీఎం నాయకులు

విజయనగరం ఫూల్‌బాగ్: విశాఖ స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం ఈ నెల 20 నుండి 25వరకు శ్రీకాకుళం నుండి విశాఖ స్టీల్‌ప్లాంట్ వరకు ఉక్కు రక్షణ యాత్ర నిర్వహించనున్నట్టు సీపీఎం జిల్లా కార్యదర్శి టి.సూర్యనారాయణ తెలిపారు. స్థానిక ఎల్‌బీజీ భవన్‌లో శనివారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యాత్ర వాల్‌పోస్టరును విడుదల చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రెడ్డి శంకర్రావు, టీవీ రమణ, వి.లక్ష్మి, పి.శంకర్ తదితరులు పాల్గొన్నారు.

చిట్టి చేతుల్లో మట్టి గణపతి


మట్టితో గణపతి ప్రతిమల తయారీలో నిమగ్నమైన చిన్నారులు


బహుమతులు గెలిచిన విద్యార్థులతో సాక్షి సిబ్బంది, ముఖ్యఅతిథులు

గెలిచిన బహుమతులతో ఆనందంగా వెళ్తున్న చిన్నారులు

- మట్టి వినాయకుడునే పూజిద్దాం
- పర్యావరణహితంగా వినాయకచవితి
- కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజినీరు సరిత
- సాక్షి మీడియా, ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో విద్యార్థులకు మట్టి విగ్రహాలపై అవగాహన
- మట్టి ప్రతిమల తయారీలో ఉత్సాహంగా పాల్గొన్న చిన్నారులు

విజయనగరం రూరల్: 'సాక్షి' మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త నిర్వహణలో విజయనగరం ఫోర్టు సిటీ స్కూల్‌లో శనివారం సాగిన 'చిన్నారుల చేతుల్లో మట్టిగణపతి కార్యక్రమం' సందడిగా సాగింది. నిర్వాహకులు అందజేసిన మట్టితో ఆదిదేవుడి ప్రతిమలను చిన్నారులు అందంగా తయారు చేశారు. వాటిని పదేపదే చూస్తూ మురిసిపోయారు. మా మంచి మట్టిగణపయ్య అంటూ చిరునవ్వులు చిందించారు. మట్టిగణపతినే పూజిద్దామన్న సందేశాన్నిచ్చారు. తొలుత కార్యక్రమాన్ని ఫోర్టు సిటీ విద్యా సంస్థల చైర్మన్ కేపీపీ రాజు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం జరిగిన బహుమతి ప్రదానోత్సవానికి కాలుష్య నియంత్రణ మండలి కార్యనిర్వాహక ఇంజినీర్ సరిత ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వినాయక చవితికి, పర్యావరణానికి విడదీయరాని సంబంధం ఉందన్నారు. కొన్నేళ్లుగా వినాయకుని విగ్రహాలు హానికారక ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేయడంతోపాటు పర్యావరణానికి చేటుచేసేలా రసాయనాలతో కూడిన రంగులను వినియోగిస్తున్నారన్నారు. దీంతో నీటి కాలుష్యం ఏర్పడి జీవావరణం దెబ్బతింటోందని తెలిపారు. ఎటువంటి రంగులు పూయని మట్టి విగ్రహాలను పూజించాలని, వీటి వినియోగంపై అవగాహన పెంచుకోవాలన్నారు. విద్యార్థులు వారి తల్లిదండ్రులతో పాటు ప్రతి ఒక్కరికీ పర్యావరణ పరిరక్షణపై, ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే దుష్పరిమాణాలపై అవగాహన కల్పించాలన్నారు. ఫోర్టు సిటీ విద్యా సంస్థల చైర్మన్ కేపీపీ రాజు మాట్లాడుతూ నీటి కాలుష్యం, వాయు కాలుష్యంతో భవిష్యత్తు తరాలు నష్టపోతాయన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని, కాలుష్య నియంత్రణకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలన్నారు. 'సాక్షి' బ్యూరో ఇన్‌చార్జి అల్లు సూరిబాబు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణతోనే భావితరాలకు మేలు కలుగుతుందని, మన పూర్వీకుల సంప్రదాయమైన మట్టి గణపతి విగ్రహాలను పూజించేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం మట్టి గణపతి విగ్రహ తయారీ పోటీల్లో మొదటి బహుమతి కస్పా ఉన్నత పాఠశాల విద్యార్థి సీహెచ్.ఫణిశర్మ, ద్వితీయ బహుమతి ఫోర్టు స్కూల్ విద్యార్థిని కె.షర్మిలారాణి, తృతీయ బహుమతి జొన్నవలస ఉన్నత పాఠశాల విద్యార్థి కె.వి.జ్ఞానేశ్వర్‌లు సాధించారు. కన్సోలేషన్ బహుమతులను ఎం.సంజయ్(పల్లవి విద్యామందిర్), ఎం.హాసిని, జె.జోషిత(ఫోర్టు సిటీ స్కూల్), కె.హిమనేష్(సెయింట్ మేరీ పాఠశాల), ఎస్.మోసే(మలిచర్ల జెడ్పీహెచ్‌ఎస్), పి.విజయ్‌కుమార్(జెడ్పీహెచ్‌ఎస్), ఆర్.నిరంజన్ (శ్రీ చైతన్య)లు ఈఈ సరిత, ఫోర్టు సిటీ స్కూల్ చైర్మన్ కేపీపీ రాజు చేతుల మీదుగా అందుకున్నారు. కార్యక్రమంలో ఫోర్టు సిటీ స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ రొహినాఖాన్, డైరెక్టర్ మధు, సాక్షి ప్రకటనల విభాగం మేనేజర్ ఆర్.నగేష్‌లు పాల్గొనగా, న్యాయ నిర్ణేతగా జొన్నవలస జెడ్పీ ఉన్నత పాఠశాల చిత్రలేఖనం ఉపాధ్యాయులు రేజేటి కరుణాకర్, పలు పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మట్టి గణపతిని పూజిస్తాం



నీటి కాలుష్యం నివారించాలంటే మట్టి గణపతినే పూజించి, నిమజ్జనం చేయాలి. ప్లాస్టిక్ నియంత్రణ, రసాయనాలతో కూడిన రంగుల వినియోగం, ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో చేసిన విగ్రహాలతో పర్యావరణానికి కలిగే అనర్థాలపై అందరికీ అవగాహన కల్పిస్తాను.

– కె.హిమనేష్, 6వ తరగతి, సెయింట్ మేరీ స్కూల్

కాలుష్య నియంత్రణే ప్రధానం



పర్యావరణ వినాశానికి కారణమయ్యే కాలుష్యంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు తన వంతు కృషి చేస్తా. కాలుష్య నియంత్రణకు చేపట్టే అవగాహన కార్యక్రమాల్లో పాల్గొని తోటి విద్యార్థులకు అవగాహన కల్పిస్తా. కాలుష్యనియంత్రణే మనముందున్న లక్ష్యం.

– ఆర్.పవన్, 9వ తరగతి, కస్పా ఉన్నత పాఠశాల

జీవరాశిని కాపాడుతాను



కాలుష్యం బారిన పడకుండా జీవరాశిని రక్షించేందుకు పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరం కృషి చేయాల్సిన అవసరం ఉంది. కాలుష్యానికి కారణమయ్యే ప్లాస్టిక్, ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయన రంగుల నియంత్రణపై అందరికీ అవగాహన కల్పిస్తా. మట్టిగణపతి తయారీపై ఇచ్చిన శిక్షణ బాగుంది.

– జ్ఞానేశ్వర్, 10వ తరగతి విద్యార్థి, జెడ్పీహెచ్‌ఎస్, జొన్నవలస

ప్రకృతిని ప్రేమించాలి



ప్రకృతిని ప్రేమించిన నాడే పర్యావరణాన్ని కాపాడిన వారుమవుతాం. పర్యావరణానికి, జీవ వైవిధ్యానికి మేలు చేసే కార్యక్రమాలపై అవగాహన కల్పించడానికి కృషి చేస్తాను. ప్లాస్టిక్ వినియోగంతో కలిగే నష్టాలను అందరికీ వివరిస్తాను.

– ఎస్.మోసే, 10వ తరగతి విద్యార్థి, జెడ్పీ ఉన్నత పాఠశాల, మలిచర్ల

పర్యావరణంపై అవగాహన కల్పిస్తా



మట్టి గణపతి విగ్రహాలతో కలుగే ప్రయోజనాలు నా స్నేహితులకు వివరిస్తాను. వారితో పాటు, నా చుట్టుపక్కల వారికి మట్టి గణపతిని పూజించమని చెప్పి పర్యావరణ పరిరక్షణకు ఇప్పటి నుంచే నావంతు కృషి చేస్తాను.

– కె.మేధన, 9వ తరగతి, ఫోర్టు సిటీ స్కూల్

తల్లిని చంపిన తనయుడికి రిమాండ్

- కన్నతల్లిని క్రూర మృగంలా కడతేర్చాడు
- డీఎస్పీ శ్రీధర్
- నిందితుడికి రిమాండ్


నిందితుడు శ్రీనివాసరావును అరెస్ట్ చేసి వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీధర్

రామభద్రపురం: జన్మనిచ్చిన తల్లిని క్రూర మృగంలా కన్నబిడ్డే దారుణంగా హతమార్చాడని డీఎస్పీ పి.శ్రీధర్ తెలిపారు. మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వలేదన్న కోపంతో మండల కేంద్రంలోని వసంతుల వీధిలో ఈ నెల 14వ తేదీ అర్ధరాత్రి కన్నతల్లిని కుమారుడే హత్య చేసిన సంగతి తెలిసిందే. అయితే హత్య చేసిన నిందితుడు రామభద్రపురం వీఆర్వో వద్ద లొంగిపోవడంతో పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. సీఐ తిరుమలరావు, ఎస్‌ఐలు సురేంద్రనాయుడు, జయంతిలతో కలిసి శనివారం డీఎస్పీ పి.శ్రీధర్ విలేకర్ల సమావేశంలో దీనికి సంబంధించిన వివరాలు వెల్లడించారు. రామభద్రపురం గ్రామం వసంతుల వీధికి చెందిన ఉప్పల రమణమ్మ(75)కు ఆరుగురు సంతానం. వారిలో ఆఖరి సంతానం శ్రీనివాసరావుతో కలిసి ఉంటుంది. శ్రీనివాసరావు రామభద్రపురం జంక్షన్‌లో చిన్న టిఫిన్ కొట్టు పెట్టుకుని జీవనం సాగిస్తూ మద్యానికి బానిసయ్యాడు. టిఫిన్ కొట్టు మీద వచ్చిన డబ్బులు రోజూ తాగేసి ఇంటికి వెళ్లేవాడు. ఆ డబ్బులు చాలక తల్లిని తాగేందుకు డబ్బులు అడుగుతూ రోజూ గొడవ పడేవాడు. తల్లి రోజూ మద్యం తాగొద్దని వారించేది. డబ్బుల్లేక ఇల్లు గడవడం లేదని నచ్చజెప్పేది. దీంతో శ్రీనివాసరావు రోజూ తనను తల్లి మందలిస్తుందని భావించి ఈ నెల 14న దుకాణం తెరవకుండా మద్యం తాగేందుకు రోజూలాగే తల్లిని డబ్బులు అడిగాడు. డబ్బుల్లేవని చెప్పడంతో పింఛన్ డబ్బులు ఇవ్వాలని పట్టుబట్టాడు. అయినా డబ్బులు తల్లి ఇవ్వకపోవడంతో అదే రోజు అర్ధరాత్రి మద్యం తాగి వచ్చి పడుకున్న తల్లిని ఇంట్లో ఉన్న రాడ్డుతో తలపై మోదాడు. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఇంకా బతికే ఉందన్న అనుమానంతో రాడ్డు నోటిలో పెట్టి చేతితో తల్లి నాలుక లాగేశాడు. ఆ నాలుకను పేపరులో చుట్టి ప్యాంట్ జేబులో పెట్టి పోలీసులకు చూపాడు. ఎస్‌ఐ జయంతి దర్యాప్తు చేయగా సీఐ తిరుమలరావు విచారించి కేసు నమోదు చేశారు. నిందితుడు శ్రీనివాసరావును శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

కత్తి చూపించి.. బెదిరించి...

విజయనగరం క్రైమ్: ఉదయం 5 గంటల ప్రాంతంలో ఇంటికి నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని అటుగా వస్తున్న ముగ్గురు వ్యక్తులు అడ్డగించి అతని వద్ద డబ్బులు లేకపోయేసరికి అతని వద్ద నున్న సెల్ లాక్కొని పరారయ్యారు. దీనికి సంబంధించి వన్‌టౌన్ పోలీసులు శనివారం అందించిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక జేఎన్‌టీయూ గోడౌన్స్ సమీపంలో రాత్రి విధులు నిర్వహించి కెఎల్.పురం వైపు శనివారం వేకువజామున 5 గంటల ప్రాంతంలో ఇంటికి నడుచుకుంటూ వస్తున్న సింగంపల్లి రవి అనే వ్యక్తిని ఆర్‌టీఓ కార్యాలయం సమీపంలో బైక్ పై అటు నుంచి వచ్చిన ముగ్గురు వ్యక్తులు చాకు చూపి బెదిరించారు. అతనివద్ద డబ్బులేవీ దొరక్కపోవడంతో చేతిలో ఉన్న సెల్‌ను లాక్కొన్నారు. బైక్ పై వెళ్లిపోవడానికి ప్రయత్నిస్తున్న వారిని రవి పట్టుకోవడానికి ప్రయత్నం చేశారు. దీంతో అతన్ని ఈడ్చుకుంటూ వెళ్లిపోయారు. దీంతో అతను తీవ్ర గా యలపాలయ్యాడు. వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

21న జిల్లా స్థాయి యువజనోత్సవాలు

విజయనగరం: యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఏటా నిర్వహించే యువజనోత్సవాలను ఈ నెల 21న గాజులరేగలోని సీతం ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహిస్తామని సెట్విజ్ సీఈఓ బి.రామ్‌గోపాల్ శనివారం తెలిపారు. ఆ రోజు ఉదయం 9 గంటల నుంచి ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. సాంస్కృతిక విభాగంలో జానపద నృత్యాలు, జానపద గీతాల పోటీలు, జీవిత నైపుణ్య విభాగంలో స్టోరీ రైటింగ్, పోస్టర్ మేకింగ్, డిక్లమేషన్, ఫొటోగ్రఫీ అంశాల్లో యువత తమ ప్రతిభను నిరూపించుకోవాలన్నారు. పోటీల్లో పాల్గొనేందుకు 15 నుంచి 29 సంవత్సరాల మధ్య వయసున్న యువతీయువకులు అర్హులని తెలిపారు. ఉత్సవాల్లో ప్రథమ స్థానం సాధించిన వారిని రాష్ట్ర స్థాయి ఉత్సవాలకు ఎంపిక చేస్తామన్నారు. రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభకనబరిచిన వారికి జాతీయ యువజనోత్సవాలకు ఎంపిక చేస్తారన్నారు. ఉత్సవాల్లో పాల్గొనేవారు ఈ నెల 20వ తేదీలోగా సెల్: 98491 99384, 82475 54334 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష నమోదుకు గడువు పెంపు

విజయనగరం అర్బన్: నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) పరీక్ష కోసం నమోదు చేసుకోవడానికి గడువును ఈ నెల 25వ తేదీ వరకు పొడిగించినట్లు డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, ఎయిడెడ్ స్కూల్లలో, వసతి సౌకర్యం లేని ఏపీ మోడల్ స్కూల్స్‌లో 8వ తరగతి చదువుతూ రూ.3.5 లక్షలలోపు వార్షిక ఆదాయం ఉన్న విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని తెలిపారు. పరీక్ష రుసుం జనరల్ మరియు బీసీ విద్యార్థులకు రూ.100, ఎస్సీ ఎస్టీ విద్యార్థులకు రూ.50 చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఈ నెల 28వ తేదీలోగా నామినల్ రోల్స్‌కు సంబంధించిన పత్రాలతో జతపరచి స్ట్రాంగ్ రూమ్, ఎంఆర్ మోడల్ స్కూల్‌లోని స్ట్రాంగ్ రూంనకు సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులు అందజేయాలని సూచించారు. పూర్తి వివరాల కోసం 'బీఎస్‌ఈ.ఏపీ.జీఓవి.ఐఎన్' వెబ్ సైట్ ద్వారా తెలుసుకోవాలని సూచించారు.

ఏకాగ్రతతోనే వృత్తిలో రాణింపు



సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ రామకృష్ణప్రసాద్

- హైకోర్టు జడ్జి జస్టిస్ రామకృష్ణ ప్రసాద్

సాక్షి ప్రతినిధి, విజయనగరం: వృత్తిలో ఏకాగ్రతతోనే రాణింపు సాధ్యమని హైకోర్టు జడ్జి జస్టిస్ జి.రామకృష్ణప్రసాద్ జూనియర్లకు హితవు పలికారు. జిల్లా పోర్టుపోలియో జడ్జిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత శనివారం మొట్టమొదటిసారిగా ఆయన జిల్లా కోర్టుకు వచ్చారు. ఈ సందర్భంగా న్యాయవాదుల సంఘ ఆహ్వానం మేరకు ఆయన సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సీనియర్ న్యాయవాదులు కేసుల విచారణ, వాదోపవాదాలు జరుపుతున్నప్పుడు జూనియర్లు అనుసరించాలన్నారు. ఎటువంటి అనుమానాలు ఉన్నా వాటిని ఎప్పటికప్పుడు నివృత్తి చేసుకోవాలని సూచించారు. సీనియర్ న్యాయవాదుల పర్యవేక్షణలో ప్యానల్ ఏర్పాటు చేసి జూనియర్ల సందేహాలు నివృత్తిచేయాలన్నారు. డ్రాఫ్టింగ్‌పైనే కోర్టులో కేసులు ఆధారపడి ఉంటాయన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.కళ్యాణచక్రవర్తి, న్యాయవాదుల సంఘ అధ్యక్ష, ఉపాధ్యక్షులు సీహెచ్ దాము, ఎ.అంజనీకుమార్, కార్యదర్శి వి.జి.సంతోష్, రాష్ట్ర బార్ కౌన్సిల్ మాజీ చైర్మన్ కె.వి.ఎస్.తమ్మన్నశెట్టి, ప్రభుత్వ న్యాయవాది టి.బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా న్యాయసేవా సదన్‌లో సెమినార్

జిల్లా వ్యాప్తంగా న్యాయమూర్తులకు జిల్లా న్యాయసేవా సదన్‌లో సివిల్ లాపై సెమినార్ నిర్వహించారు. ఈ సెమినార్‌లో రాష్ట్ర హైకోర్టు మాజీ జడ్జి జస్టిస్ ఎం.సీతారామ్మూర్తి, జస్టిస్ రామకృష్ణప్రసాద్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.కళ్యాణ్‌చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు 'ఆశ్రమ' విద్యార్థులు


రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

సీతంపేట: రాష్ట్ర స్థాయి హాకీ క్రీడా పోటీలకు స్థానిక గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. శ్రీకాకుళంలో శనివారం జరిగిన జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల్లో 8వ తరగతి చదువుతున్న ఎన్.నవీన్ కుమార్, ఏడో తరగతి చదువుతున్న ఎస్.త్రినాథ్ రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. వీరిని పాఠశాల హెచ్‌ఎం టి.చంద్రరావు, డిప్యూటీ వార్డెన్ గానయ్య, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

రాష్ట్ర అథ్లెటిక్స్ పోటీలకు వంగర విద్యార్థులు


లాంగ్ జంప్ సాధన చేస్తున్న దేవకివాడ అశోక్


స్ప్రింట్ రన్ సాధన చేస్తున్న చందు

వంగర: రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు వంగర జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. అండర్ – 14 లాంగ్ జంప్ విభాగంలో దేవకివాడ అశోక్, 60 మీటర్ల స్ప్రింటర్‌న్ విభాగంలో కొమరాపు చందు జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని హెచ్‌ఎం ముద్దాడ రమణమ్మ తెలిపారు. వీరికి ఎస్‌ఐఎస్ అథ్లెటిక్ కోచ్ నాచు గోవర్ధనరావు, పీఈటీ కవిత పాఠశాల ఆవరణలో ప్రత్యేక శిక్షణ అందిస్తున్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం


వ్యాయామశాల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, నగర మేయర్

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి
- 35వ డివిజన్‌లో రూ.23 లక్షలతో నిర్మించిన వ్యాయామశాల ప్రారంభం

విజయనగరం: ప్రస్తుత ఆధునిక ప్రపంచంలో ఆరోగ్యమే మహాభాగ్యమని, ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ప్రతిరోజూ వ్యాయామం చేయాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 35వ డివిజన్ వీటీ అగ్రహారం ప్రాంతంలో రూ.23 లక్షల కార్పొరేషన్ నిధులతో ఏర్పాటు చేసిన వ్యాయామశాలను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్థానిక యువత కోరిక మేరకు వ్యాయామశాల ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అనంతరం వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జ్ బొద్దాన అప్పారావు, స్థానిక కార్పొరేటర్ చందక శ్రీనివాసరావు మాట్లాడుతూ, వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత డివిజన్ పరిధిలో ఇప్పటికే రూ.3 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టిన ఘనత డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామికే దక్కుతుందన్నారు. ఇటీవల కాలంలో రూ.1.60 కోట్లతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రహదారులు, కాలువల నిర్మాణాలు చేపట్టి ప్రజలకు మౌలిక సదుపాయాలను కల్పించారని గుర్తు చేశారు. కోలగట్ల ఆరోగ్యాలయం పేరుతో వ్యాయామశాలను ఏర్పాటు చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కోలగట్ల వీరభద్రస్వామిని మరోసారి గెలిపిస్తే నగరం ఎంతో అభివృద్ధి చెందుతుందని తెలిపారు. కార్యక్రమంలో మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ లయాయాదవ్, జోనల్ ఇన్‌చార్జ్‌లు కుమ్మరిగంటి శ్రీనివాసరావు, మారం బాలబ్రహ్మారెడ్డి, మాజీ కౌన్సిలర్ తాత్రాజు కృష్ణ, డివిజన్ అధ్యక్షుడు అశోక్, కార్పొరేషన్ ఈఈ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.